సాక్షి
వికారాబాద్

మంగళవారం, 10, సెప్టెంబర్, 2024



దగ్గరగా 'దూరవిద్య'

చదువు మానేసిన వారు చదువుకోవాలనే ఆసక్తి ఉంటే ప్రభుత్వం ఓపెన్ స్కూల్ ద్వారా దూరవిద్యను అందిస్తోంది. 8లో▶



మోతాదుకు మించొద్దు

పత్తి పంటలో అధిక తేమ కారణంగా తెగులు ఉధృతి పెరిగే అవకాశం ఉందని ఏరువాక కేంద్రంకో ఆర్డినేటర్ లక్ష్మణ్ అన్నారు. 8లో▶



దోమకాటు..

వర్షాలకు వీధులు, ఇంటి పరిసరాల్లో పారిశుద్ధ్యం లోపించి దోమలు వ్యాప్తి చెందే అవకాశాలు ఉన్నాయి. 9లో▶

న్యూస్‌రీల్

దరఖాస్తుల ఆహ్వానం

కద్లాల్: మండలంలోని మైసిగండి బాలుర గిరిజన ఆశ్రమ పాఠశాలలో 2024 –25 విద్యా సంవత్సరానికి గాను కాంట్రాక్ట్ పద్ధతిన పాఠాలు బోధించడానికి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆ పాఠశాల హెచ్‌ఎం బాలరాజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్ఛేంజ్ నందు 1 – 7 –2020 నాటికి 18 సంవత్సరాలు నిండి, 39 సంవత్సరాలు కలిగి ఉండాలన్నారు. రిజర్వేషన్ కేటగిరికి 45 సంవత్సరాలు, జిల్లా వాస్తవ్యుడై ఉండాలన్నారు. కద్లాల్ మండలానికి చెందిన వారికి మొదటి ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలిపారు. ఇంగ్లిష్, సోషల్ స్టడీస్ (స్కూల్ అసిస్టెంట్) ఆంగ్ల మాధ్యమంలో బోధించాలని, అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సంబంధిత సబ్జెక్టుల్లో డిగ్రీ తోపాటు పోస్ట్ గ్రాడ్యుయేషన్ బీఈడీ, టెట్ కలిగి ఉండాలన్నారు. బోధన అనుభవానికి వెయిటేజీ మార్కులు ఇవ్వనున్నట్లు తెలిపారు. అర్హత, ఆసక్తి కలిగిన అభ్యర్థులు తమ బయోడేటా, విద్యార్హతలు, పూర్తి చేసిన దరఖాస్తు ఫారాన్ని జిల్లా గిరిజన సంక్షేమ శాఖ కార్యాలయం–2వ అంతస్తు, సమీకృత జిల్లా కలెక్టరేట్ కార్యాలయ సముదాయం, కలెక్టర్ కాంప్లెక్స్ కొంగర కలాన్ నందు ఈ నెల 10నుంచి 18వ తేదీలోగా దరఖాస్తులు సమర్పించాలని కోరారు. ఎంపికైన అభ్యర్థులకు గౌరవ వేతనం నెలకు రూ.28,977 ఇవ్వనున్నట్లు తెలిపారు.

డీసీసీబీ వైస్ చైర్మన్‌గా రవిగౌడ్ ఎన్నిక



రవిగౌడ్‌ను సన్మానిస్తున్న నాయకులు

తాండూరు రూరల్: మాజీ మంత్రి, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి ప్రధాన అనుచరుడు.. తాండూరు మండలం సంగెంకలాన్‌కు చెందిన సంగెం రవిగౌడ్ డీసీసీబీ వెస్ చైర్మన్‌గా ఎన్నికయ్యారు. ప్రస్తుతం ఆయన ఎల్మకన్నె పీఏసీఎస్ చైర్మన్ తోపాటు డీసీసీబీ డైరక్టర్‌గా కొనసాగుతున్నారు. డీసీసీబీ చైర్మన్ మనోహర్‌రెడ్డి తాండూరు ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఆయన స్థానంలో చైర్మన్‌గా సత్తయ్య, వైస్ చైర్మన్‌గా రవిగౌడ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సోమవారం హైదరాబాద్‌లోని డీసీసీబీలో రవిగౌడ్ ప్రమాణ స్వీకారం చేశారు. పలువురు నాయకులు ఆయన్ను ఘనంగా సన్మానించారు.

'పట్నం'ను కలిసిన రవిగౌడ్

తాండూరు: డీసీసీబీ వైస్ చైర్మన్‌గా నియమితులైన రవిగౌడ్ సోమవారం నగరంలో ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డిని ఆయన నివాసంలో కలిశారు. ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి ఆశీస్సులు పొందారు.

బాధితులను ఆదుకుంటాం
తహసీల్దార్ సాజిదాబేగం



వర్షాలకు కూలిన ఇల్లు

ధారూరు: మండలంలోని కేరెళ్లి గ్రామంలో వర్షాలకు కూలిన ఇళ్లను సోమవారం తహసీల్దార్ సాజిదాబేగం పరిశీలించారు. వరుస వర్షాలకు తిప్పని నర్సింహారెడ్డి ఇల్లు కూలి పిట్టల రాములు ఇంటిపై పడింది. దీంతో అది కూడా కూలిపోయింది. ఇందుకు సంబంధించిన వివరాలు, కూలిన ఇళ్ల ఫొటోలను కలెక్టర్‌కు పంపించారు. పరిహారం అందేలా చూస్తామని తహసీల్దార్ తెలిపారు. అనంతరం శిథిలావస్థకు చేరిన నర్సింహారెడ్డి ఇంటిని పూర్తిగా కూల్చివేయించారు.

కుర్మిద్దలో కొండచిలువ ప్రత్యక్షం



యాచారం: కుర్మిద్ద గ్రామంలోని ఓ వ్యవసాయ పొలంలో సోమవారం కొండచిలువ ప్రత్యక్షమైంది. అటవీ ప్రాంతం సమీపంలో ఉన్న కిషన్‌రెడ్డి పొలంలో ఐదు మీటర్ల కొండ చిలువను రైతులు గుర్తించారు. విషయం తెలుసుకున్న సమీప పొలాల రైతులు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకున్నారు. కొండచిలువ రైతులపై దాడి చేయడానికి ప్రయత్నించగా కొంతమంది కర్రలతో కొట్టి అటవీ ప్రాంతంలో వదిలేశారు.



నవాబుపేట మండలంలో వర్షాలకు దెబ్బతిన్న టమాటా పంట

నష్టం.. అపారం

జిల్లాలో ఈ ఏడాది 1,175 ఎకరాల్లో పంట నష్టం

- పరిహారం కోసం ఎదురుచూపులు
- ఏటా ఇదే పరిస్థితి
- ప్రభుత్వానికి నివేదికలతో సరి

వికారాబాద్: ఇటీవల జిల్లా వ్యాప్తంగా కురిసిన భారీ వర్షాలకు వందల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి. పరిహారం కోసం రైతన్నలకు ఎదురు చూపులు తప్పడం లేదు. లక్షల్లో పెట్టుబడులు పెట్టి ఎండనకా వాననకా కష్టపడి పండించిన పంటలు చేతి కొచ్చే సమయంలో వర్షాల పాలవుతున్నాయి. ఐదేళ్లుగా రైతులు ప్రకృతి ప్రకోపానికి పంటలను నష్టపోతున్నారు. పంటలు నీట మునిగిన సమయంలో మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులు హడావుడి చేస్తున్నారే తప్ప ఆ తరువాత పట్టించుకోవడం లేదని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది కురిసిన భారీ వర్షాలకు వందల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి. స్పీకర్, ఎమ్మెల్యేలు క్షేత్రస్థాయిలో పర్యటించారు. పంట నష్టాన్ని పరిశీలించారు. ఆదుకుంటామని హామీ ఇచ్చారు. ప్రతిపక్షాలు, రైతు సంఘాల నాయకులు ఎకరాకు రూ.25 వేలు చొప్పున పరిహారం ఇవ్వాలన్నారు. అధికారులు నీట మునిగిన, దెబ్బతిన్న పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించి నష్టాన్ని అంచనా వేశారు. ప్రభుత్వానికి నివేదిక పంపారు. రెండు రోజుల క్రితం సెర్ప్ సీఈఓ దివ్యా దేవరాజన్ పాడైన పంటలు పరిశీలించారు. అధికారులతో సమీక్ష కూడా నిర్వహించారు. గతంలో లాగానే పంట నష్టం అంచనాలు వేయడం వరకే పరిమితం అవుతుందా..? లేక రైతులకు పరిహారం చెల్లిస్తారా.? అని బాధితులు ఆందోళన చెందుతున్నారు.

వందల ఎకరాల్లో..

ఇప్పటి వరకు వ్యవసాయ శాఖ ప్రభుత్వానికి పంపిన నివేదికల ప్రకారం జిల్లా వ్యాప్తంగా 1,175 ఎకరాల్లో వివిధ రకాల పంటలు దెబ్బతిన్నట్లు తెలిసింది. ఎక్కువగా పత్తి, కూరగాయ పంటలు పాడయ్యాయి. నవాబుపేట, వికారాబాద్, ధారూరు, దౌల్తాబాద్ తదితర మండలాల్లో పంటలకు తీవ్ర నష్టం జరిగినట్లు అధికారులు గుర్తించారు. ఉద్యానవన పంటలకు భారీ నష్టం వాటిల్లింది. వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులు నష్టపోయిన పంటలకు సంబంధించి సర్వే చేసి వివరాలు నమోదు చేశారు. రైతులకు త్వరలో పరిహారం అందిస్తామని సీఎం స్వయంగా ప్రకటించారు. నాలుగేళ్లుగా ఇదే తరహా హామీలు తప్ప పరిహారం అందడంలేదు. దీంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతేడాది పంట నష్టపోయిన రైతులకు పరిహారం ఇచ్చి ఆదుకోవాలని హైకోర్టు సైతం ప్రభుత్వాన్ని ఆదేశించింది. అయినా ఇప్పటి వరకు సాయం అందలేదు. ఈ సారైనా పరిహారం అందుతుందా.. ? లేక గతంలో లాగానే హడావుడి చేసి చేతులు దులుపుకొంటారా..? అని రైతులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

నాలుగేళ్లుగా పంటలకు నష్టం..

2020లో కురిసిన భారీ వర్షాలకు జిల్లాలో పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. వ్యవసాయ శాఖ అధికారులు నిర్వహించిన సర్వే ప్రకారం 4.5లక్షల ఎకరాల్లో ఆయా పంటలు సాగు చేయగా.. 1.25లక్షల ఎకరాల్లో నష్టం వాటిల్లింది. 2021లో కూడా భారీ వర్షాలకు 25వేల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి. 2022లో 2వేల ఎకరాల్లో, యాసంగి సీజన్‌లో వడగండ్ల వానకు 6వేల ఎకరాల్లో పంటలు నష్టపోయారు. 2023లో కురిసిన భారీ వర్షాలకు 3,399 ఎకరాల్లో, తాజాగా 1,175 ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లినట్లు అధికారులు గుర్తించారు. ప్రభుత్వం తక్షణం ఆదుకోవాలని అన్నదాతలు కోరుతున్నారు.

మహోన్నత వ్యక్తి కాళోజీ

- కలెక్టర్ ప్రతీక్ జైన్
- ఘనంగా జయంతి వేడుకలు

అనంతగిరి: ప్రజల్లో సామాజిక, రాజకీయ చైతన్యం తెచ్చేందుకు కాళోజీ చేసిన కృషి మరువలేనిదని కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. తెలంగాణ భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం కలెక్టరేట్‌లో కాళోజీ నారాయణ రావు జయంతి వేడుకలు జరిగాయి. యువజన క్రీడల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమాన్ని కలెక్టర్ జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. అదనపు కలెక్టర్లు లింగ్యానాయక్, సుధీర్, ఆర్డీఓ వాసు చంద్రతో కలిసి కాళోజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సామాజిక సమస్యలపై నిర్మొహమాటంగా, నిక్కచ్చిగా స్పందించే వ్యక్తిత్వం కాళోజీది అన్నారు. సత్యాగ్రహ మహోద్యమంలో పాల్గొని.. చిన్న వయసులోనే జైలు జీవితం గడిపారని తెలిపారు. విద్యార్థి దశ నుంచే నిజాం ప్రభుత్వం నిషేధాజ్ఞలకు వ్యతిరేకంగా పోరాటం చేసిన గొప్ప నాయకుడని కొనియాడారు. సామాజిక కార్యకర్తలు బందెప్ప గౌడ్, సంగీతపు రాజలింగం కాళోజీ జీవన శైలి, కవిత్వంలో ఆయన వాడిన పదజాలంపై కవితా సంపుటితో వివరించారు. వారిని కలెక్టర్ సత్కరించారు. కార్యక్రమంలో డీవైఎస్‌ఓ హనుమంత రావు, బీసీ, ఎస్సీ సంక్షేమ శాఖల అధికారులు ఉపేందర్, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణికి 199 అర్జీలు

అనంతగిరి: ప్రజావాణికి వచ్చిన దరఖాస్తులను సత్వరం పరిష్కరించాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. అదనపు కలెక్టర్లు లింగ్యానాయక్, సుధీర్, ఆర్డీఓ వాసుచంద్రతో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి వాటి పరిష్కారానికి చొరవ తీసుకోవాలని ఆదేశించారు. రుణమాఫీ కాని రైతుల నుంచి వస్తున్న అర్జీలను వ్యవసాయ శాఖ అధికారులకు పంపి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. భారీ వర్షాలకు దెబ్బతిన్న పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. అలాగే దెబ్బతిన్న ప్రభుత్వ భవనాలు, ఇళ్ల వివరాలు ఇవ్వాలన్నారు.

నేటి ప్రజావాణి రేపటికి వాయిదా

అనంతగిరి: మహాత్మాజ్యోతి బాపూలే హైదరాబాద్ ప్రజాభవన్‌లో ప్రతి మంగళ, శుక్రవారాల్లో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం ఈ నెల 11వ తేదీకి వాయిదా వేసినట్లు ప్రజాపాలన ప్రత్యేక అధికారి డి.దివ్య తెలిపారని కలెక్టర్ ప్రతీక్ జైన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 10న ప్రజాభవన్‌లో 16వ కేంద్ర ఆర్థిక సంఘంతో ముఖ్యమైన సమావేశం జరుగుతున్న నేపథ్యంలో ప్రజావాణిని బుధవారానికి మార్చినట్లు, ఈ విషయాన్ని అర్జీదారులు గమనించగలరని కోరారు.



కాళోజీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్ తదితరులు



యాలాల: కోకట్ కాగ్నా నది వద్ద నిమజ్జన ఏర్పాట్లను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్

పటిష్ట చర్యలు చేపట్టండి

- సబ్ కలెక్టర్ ఉమాశంకర్‌ప్రసాద్
- నిమజ్జన ఏర్పాట్లపై సమీక్ష

తాండూరు: వినాయక నిమజ్జనానికి ఎలాంటి ఆటంకాలు రాకుండా సంబంధిత అధికారులు పటిష్ట చర్యలు తీసుకోవాలని సబ్ కలెక్టర్ ఉమాశంకర్‌ప్రసాద్ ఆదేశించారు. సోమవారం పట్టణంలోని తన కార్యాలయంలో డీఎస్పీ బాలకృష్ణారెడ్డి, హిందూ ఉత్సవ సమితి ప్రతినిధులు, మున్సిపల్ చైర్‌పర్సన్ తాటికొండ స్వప్న పరిమళ్, పలు శాఖల అధికారులతో నిమజ్జన ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. ఈ నెల 11న విగ్రహాల నిమజ్జనం ఉంటుందని తెలిపారు. అనంతరం భద్రేశ్వర్ చౌక్ వద్ద హిందూ ఉత్సవ సమితి సభ్యులు విగ్రహాల ఊరేగింపునకు స్వాగతం పలికేందుకు ఏర్పాటు చేసే వేదికను పరిశీలించారు. అక్కడి నుంచి కోకట్ కాగ్నా నదిలో నిమజ్జనం చేసే ప్రాంతాన్ని సందర్శించారు.

కోకట్ కాగ్నా నదిని పరిశీలించిన సబ్ కలెక్టర్

యాలాల: మండలంలోని కోకట్ కాగ్నా నది వద్ద గణేశ్ విగ్రహాల నిమజ్జన ఏర్పాట్లను సోమవారం తాండూరు సబ్‌కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్ పరిశీలించారు. తాండూరు తోపాటు సమీప గ్రామాల ప్రజలు ఇక్కడ విగ్రహాలను నిమజ్జనం చేస్తారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను అధికారులతో కలిసి పరిశీలించారు. ట్రాఫిక్‌కు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా నిమజ్జన ర్యాలీలు నిర్వహించాలని నిర్వాహకులకు సూచించారు. కార్యక్రమంలో డీఎస్పీ బాలకృష్ణారెడ్డి, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ స్వప్న, హిందూ ఉత్సవ సమితి ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ సహకరించాలి: డీఎస్పీ కరుణసాగర్‌రెడ్డి

పరిగి: గణేశ్ నిమజ్జనం ప్రశాంతంగా జరిగేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని పరిగి డీఎస్పీ కరుణసాగర్‌రెడ్డి సూచించారు. సోమవారం మండలంలోని లక్నాపూర్ ప్రాజెక్టును మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్‌కుమార్‌తో కలిసి సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. లక్నాపూర్ ప్రాజెక్టులో గణేశ్ నిమజ్జనానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని తెలిపారు. ప్రతి రోజూ నిమజ్జన కార్యక్రమం ఉంటుందన్నారు. విగ్రహాలు తెచ్చే వారు పోలీసులు, అధికారులకు సహకరించాలని, వారి సలహాలు సూచనలు పాటించాలని అన్నారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఆనంద్‌రావు, సీఐ శ్రీనివాస్, ఎస్‌ఐ సంతోష్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ వెంకటయ్య, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు ఎర్రగడ్డపల్లి కృష్ణ, కౌన్సిలర్ నాగేశ్వర్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

మరిన్ని మీసేవలు!



బొంపల్లిలోని మీసేవ కేంద్రం

- అందుబాటులోకి రానున్న మరో తొమ్మిది ఆన్‌లైన్ సర్వీసులు
- త్వరలో ప్రారంభించే యోచనలో ప్రభుత్వం
- జిల్లాలో 80 మీసేవ కేంద్రాలు
- ఇప్పటి వరకు 36 శాఖల ద్వారా 314 సర్వీసులు

దోమ: రేషన్ కార్డు, ఆధార్ కార్డు, ఓటరు కార్డు, కుల, ఆదాయ, జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు.. ఇలా ఏ సర్టిఫికెట్ కావాలన్నా.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏ పథకం ప్రారంభించాలన్నా.. మీసేవ కేంద్రానికి వెళ్లాల్సిందే. సమాజంలో మీ సేవ కేంద్రాలు ప్రజల జీవితాల్లో ఒక భాగంగా మారాయి. ఇదే తరుణంలో మీసేవల ద్వారా ప్రభుత్వం మరో తొమ్మిది సర్వీసులను ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు యోచిస్తోంది. ఈ మేరకు తహసీల్దార్ నుంచి వాటికి సంబంధించిన విధి విధానాలను అందించాలని కోరినట్లు సమాచారం. జిల్లా వ్యాప్తంగా 80 మీ సేవ కేంద్రాలు ఉండగా, వీటిలో సుమారు 180 మంది ఆపరేటర్లు పని చేస్తున్నారు. అనేక రకాల సేవలు అందుబాటులో ఉన్నాయి.

పదమూడేళ్లుగా..

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సంబంధించిన సర్వీసులను ప్రజలకు సులభంగా, వేగంగా అందించే లక్ష్యంతో గత ప్రభుత్వాలు 2011లో మీ సేవ కేంద్రాలను అందుబాటులోకి తీసుకువచ్చాయి. 13 ఏళ్లుగా ఈ కేంద్రాలు ప్రభుత్వ సర్వీసులను ప్రజలకు అందిస్తూ వస్తున్నాయి. ప్రస్తుతం మీసేవ ద్వారా 36 శాఖలకు సంబంధించిన 314 సర్వీసులు ప్రజలకు అందిస్తున్నారు. రోడ్డు రవాణా శాఖ, పోలీస్, రెవెన్యూ, రిజిస్ట్రేషన్, టీ వ్యాలెట్, విద్యుత్, దేవాదాయ, వ్యవసాయ, సీడీఎంఏ తో పాటు ఇతర సర్వీసులు మున్సిపల్, నీటి పారుదల, విద్యా, హార్టీకల్చర్, న్యాయ, ఎక్సైజ్ శాఖ, సివిల్ సప్లయ్, సదరం, బీసీ వెల్ఫేర్, ధరణి, లేబర్, సోషల్ వెల్ఫేర్ వంటి సేవలను అందిస్తున్నారు.

త్వరలో మరో తొమ్మిది సర్వీసులు!

మీసేవ కేంద్రాల్లో ఇప్పటి వరకు రెవెన్యూ శాఖ ద్వారా మాన్యువల్‌గా అందజేస్తున్న తొమ్మిది రకాల సర్వీసులను ప్రభుత్వం ఆన్‌లైన్‌లో అందించేందుకు నిర్ణయించింది. ఇందులో విద్య, ఉద్యోగార్థులకు అవసరమయ్యే సర్వీసులు ఉన్నాయి. ఇప్పటి వరకు కుల, ఆదాయ, నివాస ధ్రువీకరణ పత్రాలు మీ సేవ ద్వారానే ఆన్‌లైన్‌లో ఇస్తున్నారు. ఇట్టి సర్టిఫికెట్ రెండోసారి పొందాలనుకుంటే తహసీల్దార్ కార్యాలయంలో మాన్యువల్‌గా తీసుకోవాల్సిందే. వీటిని కూడా మీసేవ ద్వారా పొందేలా ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. దీంతో పాటు గ్యాప్ సర్టిఫికెట్, పేరు మార్పిడి, స్థానిక నిర్ధారణ, క్రిమిలేయర్, నాన్ క్రిమిలేయర్, మార్కెట్ వ్యాల్యూ, ఖాస్రా, సెస్లా పహాణీ, ఆర్ఓఆర్ సర్టిఫైడ్ కాపీలు ఇక నుంచి ఆన్‌లైన్‌లో ఇచ్చేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది.

"314 సర్వీసులు అందిస్తున్నాం



మీసేవ కేంద్రాల్లో 314 సర్వీసులను ప్రజలకు ఎప్పటికప్పుడు అందిస్తున్నాం. ప్రభుత్వం మరో తొమ్మిది రకాల సర్వీసులను తీసుకురావాలని యోచిస్తున్నట్లు తెలుస్తోంది. ఒకవేళ అవి అందుబాటులోకి వస్తే వాటిని సైతం ప్రజలకు అందించేందుకు కృషి చేస్తాం.

– శివ, మీసేవ ఆపరేటర్, బొంపల్లి

ఎలాంటి ఆదేశాలు రాలేదు



మీసేవ కేంద్రాల్లో తొమ్మిది రకాల సర్వీసులు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. కానీ ఇప్పటి వరకు మాకు ఎలాంటి ఆదేశాలు రాలేదు. వాటికి సంబంధించిన విధి విధానాలను అందించాలని అడిగారు. అధికారికంగా ఆదేశాలు వచ్చిన వెంటనే ప్రజలకు తెలియజేస్తాం.

– పురుషోత్తం, తహసీల్దార్, దోమ

మహిళా రైతుకు లీగల్ నోటీసు

కేశంపేట: బ్యాంక్‌లో తీసుకున్న రుణం చెల్లించాలంటూ ఓ మహిళా రైతుకు లీగల్ నోటీసు అందింది. బాధిత కుటుంబ సభ్యుల కథనం మేరకు.. మండల కేంద్రానికి చెందిన తలసాని యశోదమ్మ గ్రామంలోని కెనరా బ్యాంకులో లోన్ తీసుకున్నారు. 2001లో రూ.68 వేల లోన్ తీసుకోగా.. ఇందులో కొంత మొత్తాన్ని తిరిగి చెల్లించారు. రూ.48,129 లోన్ డబ్బులు చెల్లించాలంటూ సోమవారం బ్యాంకు ద్వారా లీగల్ నోటీసు పంపించారు. ఇటీవల ప్రభుత్వం విడుదల చేసిన రుణమాఫీ జాబితాలో యశోదమ్మ పేరు ఉన్నప్పటికీ.. కుటుంబ సభ్యుల నిర్ధారణ కోసం ఆన్‌లైన్‌లో పెండింగ్ అని చూపిస్తోంది. దీంతో ఇందుకు అవసరమైన పత్రాలను వ్యవసాయ శాఖ అధికారులు సమర్పించారు. రైతు పేరున రేషన్‌కార్డు లేకపోవడంతో ఫ్యామిలీ గ్రూపింగ్ లేక రుణమాఫీ కాలేదని వ్యవసాయ విస్తరణ అధికారి నిఖిల్‌రెడ్డి తెలిపారు. రైతు భర్త గతంలో మరణించాడని, అతడికి ఆధార్ కార్డు లేకపోవడంతో 'సింగిల్ పర్సన్' గుర్తింపు రుణమాఫీకి ఇబ్బంది ఏర్పడిందని తెలిపారు. రైతుకు సంబంధించిన వివరాలను ఉన్నతాధికారులకు పంపించామని, నిర్ధారణ తర్వాత రుణమాఫీ వర్తిస్తుందని చెప్పారు.

'రింగ్' మార్కింగ్‌తో కలవరం

- ఆయా గ్రామాల్లో వెలసిన గుర్తులు
- సోషల్ మీడియాలో సర్వేలు, మ్యాప్‌ల పేరుతో చక్కర్లు
- చేవెళ్ల నియోజకవర్గంలో చర్చనీయాంశం

చేవెళ్ల: ఆర్ఆర్ఆర్ (రీజినల్ రింగ్ రోడ్డు) కోసం వేసిన సర్వే మార్కింగ్‌లు నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో కలవరానికి గురి చేస్తున్నాయి. ఇటీవల వేసిన గుర్తులను చూసిన ఆయా గ్రామాల ప్రజలు, రైతులు తమ భూములు పోతాయేమోనని ఆందోళనకు గురవుతున్నారు. నియోజకవర్గం పరిధిలోని షాబాద్, చేవెళ్ల, నవాబుపేట మండలాలకు సంబంధించిన పలు గ్రామాల్లో మార్కింగ్ వేశారు. అధికారికంగా ఈ రోడ్డు ఎక్కడి నుంచి వెళ్తుంది అనేది ప్రకటించకపోయినప్పటికీ వేసిన గుర్తులతో చర్చలు మొదలయ్యాయి. గతంలో కేంద్ర ప్రభుత్వం అధ్వర్యంలో జరిగిన సర్వేల ప్రకారం ఈ ప్రాంతం నుంచి రోడ్డు వెళ్తుందనే ప్రతిపాదనలు ఉన్నాయి. ఇన్నాళ్లు అటుఇటుగా రోడ్డు వస్తుందనే ఆలోచనలో ఉండగా తాజాగా రాష్ట్ర ప్రభుత్వం దక్షిణ భాగం రోడ్డు మార్కింగ్ రోడ్డు పనులను తామే చేస్తామని చెప్పడం.. ఈ రోడ్డులో మార్పులు సైతం ఉంటాయని స్వయంగా ముఖ్యమంత్రి ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో సర్వేకోసమని ఆయా గ్రామాల్లో మార్కింగ్ వేశారు. దీంతో రోడ్డు తమ గ్రామాల మీదుగానే పోతుందని ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

ఈ గ్రామాల మీదుగా గుర్తులు

షాబాద్ మండలంలోని షాబాద్, ముట్పూర్, చిలకమర్రి, రేగడి దోసాడ, ఎట్ల ఎర్రవల్లి, చేవెళ్ల మండలంలోని రేగడిఘనాపూర్, ఖానాపూర్, బస్తేపూర్, కిష్టాపూర్, నాంచేరి, అంతారం, హస్తేపూర్, కొకుంట్ల, నవాబుపేట మండలంలోని పూలపల్లి, గంగ్యాడ, పత్తేపూర్, ఎల్లకొండ తదితర గ్రామాల మీదుగా మార్కింగ్ చేసిన గుర్తులు ఉండటంతో ఈరోడ్డు ఇలాగే వెళ్తుందనే వాదనలు వినిపిస్తున్నాయి. ఎస్– 166, ఎస్– 167, ఎస్– 168, ఎస్– 169, ఎంసీపీ –10 అంటూ తెలుపు, నలుపు రంగులతో గుర్తులు వేశారు.

సమాచారం లేదంటున్న స్థానిక అధికారులు

ఇప్పటికే ఈరోడ్డుకు సంబంధించిన మ్యాపులు, సర్వేలు అంటూ అనేకం సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. ఈ రోడ్డు సర్వే ఫైనల్ మ్యాపులు, సర్వే నంబర్లు అధికారికంగా నిర్ధారించాల్సి ఉంది. అప్పటి వరకు వేచి చూడాల్సిందే. కానీ ఈ మార్కింగ్‌లతో సర్వే జరుగుతుందని ప్రజల్లో ఆందోళన మొదలైంది. దీనిపై స్థానిక రెవెన్యూ, సర్వే అధికారులను సంప్రదించగా తమకు ఎలాంటి సమాచారం లేదని చెబుతున్నారు. మార్కింగ్ విషయం కూడా తెలియదని సమాధానం ఇస్తున్నారు. అధికారులు స్పందించి ఈ రోడ్డుపై స్పష్టత ఇవ్వాలని ఆయా ప్రజలు కోరుతున్నారు.

క్లుప్తంగా

21న హిందూ ఉత్సవ సమితి సమావేశం



మాట్లాడుతున్న మాధవరెడ్డి

అనంతగిరి: వికారాబాద్‌లో నిర్వహించే గణేశ్‌ శోభాయాత్ర, రూట్‌ మ్యాప్‌, నిమజ్జనం తదితర అంశాలపై చర్చించేందుకు ఈ నెల 12న హిందూ ఉత్సవ సమితి ప్రత్యేక సమావేశం నిర్వహిస్తున్నట్లు సమితి అధ్యక్షుడు మాధవరెడ్డి, కన్వీనర్‌ కృష్ణ పంతులు తెలిపారు. సోమవారం వికారాబాద్‌ రామ మందిరంలో మాట్లాడారు. ఈ సమావేశానికి వినాయక మండపాల నిర్వాహకులు, కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు, యువజన సంఘాల సభ్యులు తప్పక హాజరవ్వాలని కోరారు. ఈ సమావేశం రామమందిరంలో గురువారం సాయంత్రం 4గంటలకు నిర్వహిస్తామన్నారు. ఈ సమావేశంలో సమితి ప్రతినిధులు రమేశ్‌ కుమార్‌, డాక్టర్‌ సత్యనారాయణగౌడ్‌, ప్రశాంత్‌కుమార్‌ పాల్గొన్నారు.

పాండురంగడి ఆలయంలో ప్రత్యేక పూజలు



పూజలో పాల్గొన్న యువకులు

ధారూరు: మండల కేంద్రంలోని పాండురంగ స్వామి ఆలయంలో ఏర్పాటు చేసిన వినాయక మండపంలో సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. వివాహం కాని యువత కోసం వివాహ సాఫల్య పూజలు నిర్వహించారు. పూజారి కుమారస్వామి అధ్వర్యంలో యువకులు సహస్రనామాలు పఠిస్తూ గణపతి పూజ చేశారు.

దోమల నివారణకు చర్యలు తీసుకోవాలి

ఫైలేరియా సబ్‌ యూనిట్‌ అధికారి పకీరప్ప



దోమలు వ్యాప్తి చెందకుండా రసాయనాలు స్ప్రే చేయిస్తున్న పకీరప్ప

బొంరాస్‌పేట: విద్యార్థులు దోమకాటుకు గురి కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఫైలేరియా సబ్‌యూనిట్‌ అధికారి పకీరప్ప సూచించారు. సోమవారం మండలం పరిధిలోని బొట్లోని తండా గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో దోమల నివారణ చర్యలు తీసుకున్నారు. కీటక జనిత వ్యాధులు, దోమల వల్లే సోకే వ్యాధులు, నివారణ చర్యలు విద్యార్థులకు వివరించారు. టాయిలెట్స్‌ శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విక్రమ్‌సింగ్‌, ఉపాధ్యాయుడు రాజన్న, మాజీ సర్పంచ్‌ మేగ్యా నాయక్‌ సిబ్బంది తదితరులున్నారు.


రెండు బైక్‌లు ఢీ.. మహిళ దుర్మరణం



రూప మృతదేహం

అనంతగిరి: ఎదురెదురుగా రెండు బైక్‌లు ఢీకొనడంతో ఓ మహిళ దుర్మరణం చెందింది. ఈ ఘటన సోమవారం వికారాబాద్‌ మున్సిపల్‌ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ నాగరాజు తెలిపిన ప్రకారం.. కర్ణాటక రాష్ట్రానికి చెందిన ప్రశాంత్‌ తన భార్య రూప(30)తో కలిసి నవాబ్‌పేట మండలం పూలపల్లికి వలస వచ్చాడు. కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. సోమవారం దంపతులు వికారాబాద్‌ వైపు వెళ్తుండగా మార్గమధ్యలో ధన్నారం వాగు వద్ద ఎదురుగా అతివేగంగా వచ్చిన బైక్‌ వీరి ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. దీంతో వెనుక కూర్చున్న రూప కిందపడి తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందింది. మృతదేహాన్ని వికారాబాద్‌ ప్రభుత్వాస్పత్రి మార్చురీకి తరలించారు.

దగ్గరగా 'దూరవిద్య'



బొంపల్లి జెడ్పీహెచ్‌ఎస్‌లో దూరవిద్య తరగతులు (ఫైల్‌)

- టాస్‌ ఆధ్వర్యంలో టెన్త్‌, ఇంటర్‌
- నేటితో ముగియనున్న దరఖాస్తుల స్వీకరణ

దోమ: అర్థాంతరంగా చదువు మానేసినవారికి చదువుకోవాలనే ఆసక్తి ఉంటే ప్రభుత్వం తెలంగాణ ఓపెన్‌ స్కూల్‌ ద్వారా దూరవిద్యను అందిస్తోంది. వివిధ పనులు చేసుకుంటూనే సెలవు దినాల్లో టెన్త్‌, ఇంటర్‌ విద్యను పూర్తి చేసుకోవడానికి సువర్ణ అవకాశం కల్పించింది. ఓపెన్‌ విద్య సర్టిఫికెట్‌కు రెగ్యులర్‌ విద్యతో సమానంగా ప్రాధాన్యం కల్పిస్తోందని విద్యావేత్తలు చెబుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ స్టేట్‌ ఓపెన్‌ స్కూల్‌ సొసైటీ(టీఓఎస్‌ఎస్‌) ఆధ్వర్యంలో దూర విద్యావిధానాన్ని ప్రోత్సహిస్తోంది.

14 ఏళ్లు పైబడిన వారు

పదవ తరగతి చదువుకునేందుకు ఎలాంటి విద్య అర్హతలు అవసరం లేదు. 14 ఏళ్లు నిండిన ఆపై వయస్సు ఉన్నవారు దరఖాస్తు చేసుకోవచ్చు. వయస్సు నిర్ధారణ ధ్రువపత్రం తహసీల్దార్‌ లేదా మున్సిపల్‌ అధికారులు జారీ చేసి ఉండాలి. మధ్యలో బడి మానేస్తే అప్పటి ట్రాన్స్‌ఫర్‌ సర్టిఫికెట్‌(టీసీ)ఆధార్‌ కార్డుతో దరఖాస్తు చేసుకోవచ్చు. పదో తరగతి, ఇంటర్మీడియట్‌ 2024–2025 విద్యా సంవత్సరానికి సంబంధించిన ఎలాంటి అపరాధ రుసుం లేకుండా మంగళవారం వరకు అడ్మిషన్‌ పొందేందుకు అవకాశం ఉందని దూర విద్య కోఆర్డినేటర్లు, జెడ్పీఎచ్‌ఎస్‌ హెచ్‌ఎంలు చెబుతున్నారు. అభ్యాసకులు ఆన్‌లైన్‌లో ఫీజు చెల్లించి రసీదును సమీపంలోని అధ్యయన కేంద్రాల్లో దరఖాస్తుతో సమర్పించాలని సూచించారు. పెనాల్టీ అక్టోబర్‌ 3 వరకు అవకాశం ఉందని చెప్పారు.

పెనాల్టీతో అక్టోబర్‌ 3వరకు



ఓపెన్‌ టెన్త్‌, ఇంటర్మీడియట్‌ తరగతులను జిల్లా పరిషత్‌ బొంపల్లి, దోమ, దాదాపూర్‌ పాఠశాలలో నిర్వహిస్తున్నాం. దరఖాస్తుల స్వీకరణ గడువు నేటితో ముగియనుంది. ఫెనాల్టీతో అక్టోబర్‌ 3 వరకు అవకాశం. చదువు మానేసిన ప్రతీ ఒక్కరు దూర విద్యను సద్వినియోగం చేసుకోవాలి.

- అనంతయ్య, దూరవిద్య కోఆర్డినేటర్‌, బొంపల్లి

నత్రజని ఎరువులు మోతాదుకు మించొద్దు

ఏరువాక కేంద్రం తాండూరు కో ఆర్డినేటర్‌ లక్ష్మణ్‌

యాలాల: ఇటీవల కురుస్తున్న వర్షాలకు పత్తి పంటలో అధిక తేమ కారణంగా తెగులు ఉధృతి పెరిగే అవకాశం ఉందని ఏరువాక కేంద్రం తాండూరు కో ఆర్డినేటర్‌ లక్ష్మణ్‌, వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్త యమున అన్నారు. సోమవారం వారు మండల పరిధిలోని రాఘవపూర్‌ శివారులో పత్తి పంటలను పరిశీలించారు. అధిక తేమ కారణంగా నత్రజని ఎరువులను మోతాదుకు మించి వాడరాదన్నారు. పత్తిలో కాయకుళ్లు తెగులు నివారణ చర్యలను రైతులకు వివరించారు. తెగులు ఉధృతిని బట్టి 15 రోజుల వ్యవధిలో మూడు నుంచి నాలుగు పర్యాయాలు మందులు పిచికారీ చేసుకోవాలన్నారు.

దెబ్బతిన్న పంటల పరిశీలన

కొడంగల్‌ రూరల్‌: ఇటీవల కురుస్తున్న వర్షాలతో దెబ్బతిన్న పంటల వివరాలను వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నారు. ఈ క్రమంలో సోమవారం మండల పరిధిలోని అన్నారం గ్రామంలో దెబ్బతిన్న పంటలను ఏఈఓ దేవేందర్‌ పరిశీలించారు. వ్యవసాయశాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పంట పొలాలను పరిశీలించి వివరాలు సేకరిస్తున్నామన్నారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి: ఏఈఓ

మర్పల్లి: వర్షాలకు పత్తి పంటల్లో నీరు చేరితే యాజమాన్య పద్ధతులు పాటించాలని మర్పల్లి రైతు వేదిక క్లస్టర్‌ ఏఈఓ నీరజ సూచించారు. సోమవారం ఆమె మండల పరిధిలోని బూచన్‌పల్లి, కోట్‌ మర్పల్లి, గ్రామాల్లో పంటలను పరిశీలించి రైతులకు సూచనలు సలహాలు ఇచ్చారు.



యాలాల: రాఘవపూర్‌లో పత్తి పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు



కొడంగల్‌ రూరల్‌: అన్నారంలో పత్తి పంట వివరాలు సేకరిస్తున్న ఏఈఓ దేవేందర్‌



షీటీంపై అవగాహన కల్పిస్తున్న పోలీసులు

ఈవ్‌ టీజింగ్‌కు పాల్పడితే చర్యలు

ఎస్‌ఐ సత్యనారాయణ

అనంతగిరి: ఈవ్‌ టీజింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని వికారాబాద్‌ ఎస్‌ఐ సత్యనారాయణ హెచ్చరించారు. సోమవారం వికారాబాద్‌ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్‌ కళాశాలలో షీటీం ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ.. అమ్మాయిలు భద్రతే తమకు ప్రధానం అన్నారు. ప్రధాన కూడళ్లలో, బస్టాండ్‌, రైల్వే స్టేషన్‌ ఆవరణలో షీటీం మఫ్టీలో ఉంటుందన్నారు. బాల్యవివాహాలు నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ఆపద సమయంలో ఉంటే డయల్‌ 100, 1098కు ఫోన్‌ చేయాలని సూచించారు. ప్రతీ ఒక్కరు రోడ్డు భద్రత నియమాలు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్‌ వెంకటేశ్వరరావు, షీటీం సిబ్బంది బుచేందర్‌రెడ్డి, రేష్మా, కళాజాత బృందం అశోక్‌ టీం తదితరులు పాల్గొన్నారు.

'ఆయకట్టు'లో ఆనందం .. 'శిఖం'లో ఆందోళన



బొంరాస్‌పేట చెరువు వద్ద గుమికూడిన రైతులు

బొంరాస్‌పేట: మండల కేంద్రంలోని చెరువు నిండి ఆయకట్టు రైతులు ఆనందం వ్యక్తం చేస్తుంటే.. మెట్లకుంట శిఖం భూముల రైతుల ఆందోళన చెందుతున్నారు. చెరువు నిండుతుండడంతో మెట్లకుంట రైతుల పంటలు మునుగుతున్నాయి. దీంతో వారు తాము నష్టపోతున్నామని నీరు కిందకు వదలాలని కోరుతున్నారు. మరో పక్క ఏర్పుమళ్ల కాకర్‌వాణి ప్రాజెక్టు రెండు వారాలుగా అలుగుపారుతూ చెరువులోకి రావాల్సిన నీరు పాటు కాల్వ గండపడి తుంకిమెట్ల కాగ్నాలో వృథాగా పారుతోంది. దీంతో మత్స్యకారుల సంఘం ఆందోళన వ్యక్తం చేస్తోంది. సోమవారం మెట్లకుంట రైతులు తమ భూముల పంటలు ముంపునకు గురవుతున్నాయని చెరువునీరు కిందకు వదిలేందుకు వచ్చారని బొంరాస్‌పేట రైతులకు సమాచారం అందింది. దీంతో ఆయకట్టు రైతులు అడ్డుకునేందుకు చెరువు వద్దకు వచ్చారు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ ఎండీ.రవూఫ్‌ చెరువు వద్దకు వచ్చి ఇరు గ్రామాల రైతులకు నచ్చజెప్పి పంపించేశారు.

పాడి ఆవు మృత్యువాత



ఆవు కళేబరం

దోమ: అనారోగ్యానికి గురైన ఓ ఆవు మృత్యువాత పడింది. ఈ ఘటన మండల పరిధిలోని మోత్కూరులో సోమవారం వెలుగులోకి వచ్చింది. గ్రామానికి చెందిన బోయిని చెన్న కిష్టయ్య జీవనోపాధికి ఆవులు తెచ్చుకున్నాడు. ఓ ఆవు రెండు రోజులుగా అస్వస్థతకు గురైంది. దీంతో రైతు మండల ఇన్‌చార్జి వైద్యాధికారి ఆనంద్‌కు సమాచారం అందించగా ఆయన ఫోన్‌లోనే మందులు చెప్పి తెచ్చుకోవాలని సూచించారు. బాధిత రైతు మందులు తెచ్చుకోగా గోపాలమిత్ర సిబ్బందితో ఫోన్‌లోనే ఎలా వాడాలో చెప్పారు. ఉదయం రైతు పొలానికి వెళ్లి చూడగా ఆవు మృత్యువాత పడింది. ఇన్‌చార్జి వైద్యాధికారికి సరిగా స్పందించకపోవడంతోనే ఆవు మృత్యువాత పడిందని బాధిత రైతు ఆరోపిస్తున్నాడు. ఆవు విలువ సుమారు రూ.60 వేలు ఉంటుందని ప్రభుత్వమే తనను ఆదుకోవాలని రైతు కోరుతున్నాడు.

క్యాంప్‌లో ఉన్నాం: డాక్టర్‌ ఆనంద్‌

ఇదే విషయమై ఇన్‌చార్జి వైద్యాధికారి ఆనంద్‌ను వివరణ కోరగా.. జిల్లా కేంద్రంలో వీధి కుక్కల సంతానోత్పత్తిని నివారించేందుకు ఆపరేషన్లు చేసేందుకు క్యాంపునకు వెళ్తున్నామన్నారు. అందుబాటులో లేకపోవడంతోనే గోపాల మిత్ర సిబ్బందికి వైద్యం అందించాలని సూచించాం. బాధిత రైతుకు ప్రభుత్వం నుంచి ఆర్థికసాయం అందేలా కృషి చేస్తామన్నారు.

హిందూ ఉత్సవ సమితికి రూ.3.51లక్షల విరాళం



విరాళం అందజేస్తున్న ఎమ్మెల్యే బీఎంఆర్‌

తాండూరు: గణేశ్‌ నవరాత్రి ఉత్సవాలు ప్రశాంతంగా నిర్వహించుకోవాలని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. సోమవారం హిందూ ఉత్సవ సమితి తాండూరు ప్రధాన కార్యదర్శి పట్లోళ్ల నర్సింలుకు రూ.3.51లక్షల విరాళం అందజేశారు. అనంతరం మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ స్వప్నపరిమళ్‌, సమితి ప్రతినిధులతో కలిసి పట్టణంలో ఏర్పాటు చేసిన వినాయక మండపాలను సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట మార్కెట్‌ కమిటీ చైర్మన్‌ పట్లోళ్ల బాల్‌రెడ్డి, కాంగ్రెస్‌ పట్టణ అధ్యక్షుడు హబీబ్‌లాల, మాజీ అధ్యక్షుడు ప్రభాకర్‌గౌడ్‌ తదితరులున్నారు.

ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఆత్మహత్యా యత్నం

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి



రాంచందర్‌(ఫైల్‌)

తాండూరు రూరల్‌: ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఓ వ్యక్తి ఆత్మహత్యకు యత్నించి చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందాడు. ఈ ఘటన మండల పరిధిలోని మిట్టబాసుపల్లిలో చోటు చేసుకుంది. కరన్‌కోట్‌ ఎస్‌ఐ విఠల్‌రెడ్డి తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన ఆత్కూర్‌ రాంచందర్‌(40) వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. రెండేళ్లగా సాగు చేస్తున్న పంటలతో నష్టం వాటిల్లుతోందని తరచూ మానసిక వేదన చెందేవాడు. ఈ క్రమంలో ఆయన ఆగస్టు 17న పొలం పక్కన రైల్వేట్రాక్‌ వద్దనున్న విద్యుత్‌ స్తంభానికి ఉరేసుకుని ఆత్మహత్యకు యత్నించగా విద్యుదాఘాతానికి గురై తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన భార్య బాలమణి వెంటనే ఆయన్ను తాండూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిశీలించిన వైద్యులు నగరంలోని గాంధీకి ఆస్పత్రికి రిఫర్‌ చేశారు. కాగా అక్కడ చికిత్స పొందుతున్న రాంచందర్‌ పరిస్థితి విషమించి ఆదివారం రాత్రి మృతి చెందాడు. మృతుడి కూతురు, కుమారుడున్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మరణంలోనూ వీడని స్నేహబంధం

రోడ్డు ప్రమాదంలో ప్రాణమిత్రుల దుర్మరణం



కరుణాకర్‌ (ఫైల్‌)



శేఖర్‌ (ఫైల్‌)

షాద్‌నగర్‌ రూరల్‌: ప్రాణ స్నేహితులను రోడ్డు ప్రమాదం బలితీసుకుంది. ఈ విషాద సంఘటన మండలంలోని ఎలికట్ట శివారులో ఆదివారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. పట్టణ సీఐ విజయ కుమార్‌ కథనం ప్రకారం.. కొందుర్గు మండలం రేగడిచిల్కమర్రికి చెందిన కరుణాకర్‌(20), పులుసుమామిడికి చెందిన రెడ్డి శేఖర్‌(26) ప్రాణస్నేహితులు. కరుణాకర్‌ ప్రైవేట్‌ కంపెనీలో డ్రైవర్‌గా పని చేస్తుండగా, శేఖర్‌ ఆర్టీసీ ప్రైవేట్‌ బస్సు నడుపుతున్నాడు. వీరు ఎక్కడికి వెళ్లినా కలిసి వెళ్లేవారు. ఈ నేపథ్యంలో ఆదివారం రాత్రి విధులు ముగించుకొని ఇంటికి వెళ్లేందుకు షాద్‌నగర్‌లో కలుసుకున్నారు. రాత్రి 10 దాటడంతో కరుణాకర్‌ తన బంధువుకు చెందిన బైక్‌ తీసుకుని ఇద్దరూ ఇంటికి బయలు దేరారు. మార్గమధ్యలో మద్యం తాగారు. ఈ క్రమంలోనే ఎలికట్ట చౌరస్తా సమీపంలో రోడ్డుపై పార్కు చేసిన ఓ లారీని ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో కరుణాకర్‌, శేఖర్‌లకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యారు.

ఇరు కుటుంబాల్లో విషాదం

విషయం తెలుసుకున్న సీఐ తన సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కరుణాకర్‌ తండ్రి కృష్ణయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ రాంచందర్‌ తెలిపారు. చేతికొచ్చిన తమ కొడుకులు విగతజీవులుగా మారడంతో తల్లిదండ్రులు, కుటుంబసభ్యులు గుండెలవిసేలా రోదించారు. ఒక్కగానొక్క కొడుకును ప్రమాదం బలి తీసుకుందని కరుణాకర్‌ తల్లిదండ్రులు గుండెలు బాదుకున్నారు. బాధితులను షాద్‌నగర్‌ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ పరామర్శించారు. కుటుంబ సభ్యులతో మాట్లాడి ప్రమాద వివరాలను తెలుసుకొని ఓదార్చారు.

హెచ్‌ఎండీఏ అధికారుల్లో 'హైడ్రా' గుబులు!

- చెరువులు, కుంటలు, పార్కు స్థలాల్లో నిర్మాణాలు
- అప్పట్లో అడ్డగోలుగా అనుమతులిచ్చిన అధికారులు
- తప్పుడు మ్యాపులు వినియోగించినట్లు ఆరోపణలు
- ఎలాంటి చర్యలు ఉంటాయోనని ఇప్పుడు టెన్షన్‌

సాక్షి, సిటీబ్యూరో: భవన నిర్మాణాలు, లే అవుట్‌లకు గతంలో అడ్డగోలుగా అనుమతులిచ్చిన కొందరు హెచ్‌ఎండీఏ అధికారులను హైడ్రా హడలెత్తిస్తోంది. చెరువులు, కుంటలు, పార్కు స్థలాలను ఆక్రమించుకొని చేపట్టిన భవనాలకు కొందరు అధికారులు నిర్మాణ సంస్థలు, బిల్డర్లతో కుమ్మక్కై ఇష్టారాజ్యంగా అనుమతులను ఇచ్చినట్లు ఆరోపణలు ఉన్నాయి. తప్పుడు మ్యాపుల ఆధారంగా కొందరు అక్రమాలకు పాల్పడితే ఇరిగేషన్‌, రెవెన్యూ అధికారులు ఇచ్చిన నిరభ్యంతర పత్రాల ఆధారంగా మరి కొందరు నిర్మాణ అనుమతులను ఇచ్చారు. ఇలా హెచ్‌ఎండీఏ పరిధిలో ఐదారేళ్లుగా వందల కొద్దీ అక్రమ కట్టడాలు వెలిశాయి. చివరకు పార్కు స్థలాలను సైతం వదిలిపెట్టకుండా చేపట్టిన ఇళ్ల నిర్మాణాలకు హెచ్‌ఎండీఏ నుంచి గ్రీన్‌ సిగ్నల్‌ లభించింది. చెరువులు, కుంటల ఎఫ్‌టీఎల్‌, బఫర్‌ జోన్లలో చేపట్టిన నిర్మాణాలకు అనుమతులు ఇవ్వ రాదని అప్పట్లో పలు సంస్థలు, వ్యక్తులు ప్రభుత్వానికి ఫిర్యాదులు చేసినప్పటికీ అవి బుట్టదాఖలయ్యాయి. ప్రస్తుతం అలాంటి నిర్మాణాలన్నింటిపైన హైడ్రా బుల్డోజర్‌ను ఎక్కుపెట్టడంతో అధికారుల్లో గుబులు మొదలైంది. ఇప్పటికే అక్రమ నిర్మాణానికి అనుమతినిచ్చిన ఓ సహాయ ప్లానింగ్‌ అధికారిపై చర్యలకు రంగం సిద్ధమైన సంగతి తెలిసిందే. ఇదే బాటలో మరి కొందరు అధికారులు ఉన్నట్లు తెలుస్తోంది. అక్రమ నిర్మాణాల నెపాన్ని ఇరిగేషన్‌, రెవెన్యూ అధికారులపైన నెట్టేందుకు ప్రయత్నిస్తున్నారు. కానీ హెచ్‌ఎండీఏ ప్లానింగ్‌ విభాగానికి చెందిన ఏపీఓలు, జేపీఓలు క్షేత్రస్థాయిలో పర్యటించిన తరువాత మాత్రమే ఫైళ్లు కదులుతాయి. ఈ క్రమంలో సదరు అధికారులు అన్ని అంశాలను సీరియస్‌గా పరిశీలించాల్సి ఉంటుంది. ఈ పరిశీలన క్రమంలోనే అక్రమాలకు తెరలేస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

పాత మ్యాపులతో మాయ..

'చెరువులు, కుంటలు, పార్కులు ఉన్న చోట భవనాలు కట్టే క్రమంలో అన్ని రకాల ముందుజాగ్రత్త చర్యలు తీసుకుంటున్నారు. హెచ్‌ఎండీఏ మాస్టర్‌ ప్లాన్‌లో సదరు స్థలం బఫర్‌జోన్‌లో ఉన్నట్లు తేలితే గూగుల్‌మ్యాపులను దరఖాస్తులతో జత చేస్తున్నారు. కొన్ని చోట్ల మాస్టర్‌ప్లాన్‌ (2013) కంటే ముందు ఉన్న మ్యాపులను పెట్టేస్తున్నారు' అని ఓ స్వచ్ఛంద సంస్థకు చెందిన ప్రతినిధి విస్మయం వ్యక్తం చేశారు. హెచ్‌ఎండీఏ రూపొందించిన మాస్టర్‌ప్లాన్‌ మాత్రమే ప్రామాణికమైనదని చెప్పే అధికారులు అందుకు విరుద్ధంగా పాత మ్యాపులతో అనుమతులకు లైన్‌లు క్లియర్‌ చేయడం గమనార్హం. మరోవైపు కొందరు ప్లానింగ్‌ అధికారులే బడా నిర్మాణ సంస్థలకు కన్సల్టెంట్లుగా, లైజనింగ్‌ అధికారులుగా వ్యవహరించారనే ఆరోపణలు కూడా బలంగా ఉన్నాయి. పటాన్‌చెరు, ఇస్నాపూర్‌, దుండిగల్‌, ఘట్కేసర్‌, శంషాబాద్‌, మేడ్చల్‌, శంకర్‌పల్లి, ఇబ్రహీంపట్నం, తుర్కయంజాల్‌ తదితర ప్రాంతాల్లో లేక్‌వ్యూప్రాజెక్టుల పేరిట వెలిసిన పలు అపార్ట్‌మెంట్‌లకు ఇలాంటి అనుమతులు లభించినట్లు ఫిర్యాదులు ఉన్నాయి. గతంలో కొన్ని నిర్మాణాలను హెచ్‌ఎండీఏ ఉన్నతాధికారులే స్వయంగా గుర్తించినప్పటికీ రకరకాల ఒత్తిళ్ల కారణంగా ఎలాంటి చర్యలను తీసుకోలేకపోయారు. కొందరు రాజకీయ ఒత్తిళ్ల కారణంగా మౌనంగా ఉండిపోతే మరి కొందరు నిర్మాణ సంస్థల నుంచే వచ్చే ఆఫర్‌లను దృష్టిలో ఉంచుకొని మౌనం వహించారనే ఆరోపణలు ఉన్నాయి.

అప్పుడు అలా ఇప్పుడు ఇలా..

అప్పుడు ఇష్టారాజ్యంగా అడ్డగోలు అనుమతులు ఇచ్చిన అధికారులు, ఉద్యోగులను ఇప్పుడు హైడ్రా బెంబేలెత్తిస్తోంది. 'అప్పట్లో అనుమతులు ఇచ్చిన ప్రాంతంలోనే ఇప్పుడు ఇరిగేషన్‌ నుంచి ఎన్‌ఓసీ కావాలని అడుగుతున్నారు. మున్సిపాలిటీ అనుమతులపైన భవనాలను నిర్మించిన చోట అదనపు అంతస్తుల కోసం దరఖాస్తు చేసుకొంటే రెవెన్యూ, ఇరిగేషన్‌ అనుమతి కావాలని చెబుతున్నారు. ఇదెక్కడి న్యాయం' అని బాలాపూర్‌, మీర్‌పేట్‌, బడంగ్‌పేట్‌, తదితర ప్రాంతాలకు చెందిన భూ యజమానులు కొందరు విస్మయం వ్యక్తం చేశారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థులకు గాయాలు

చికిత్స పొందుతూ ఒకరి మృతి

మొయినాబాద్‌: అర్ధరాత్రి బైక్‌పై వెళ్తుండగా అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టడంతో ఇద్దరు విద్యార్థులకు తీవ్ర గాయాలై.. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఒకరు మృతి చెందారు. ఈ సంఘటన మొయినాబాద్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జగిత్యాల టౌన్‌కు చెందిన భానుప్రకాశ్‌(19), నల్గొండ జిల్లా మిర్యాలగూడకు చెందిన కాశిరెడ్డి గణేశ్‌రెడ్డి మండలంలోని అజీజ్‌నగర్‌ చౌరస్తాలో ఉన్న విద్యాజ్యోతి ఇంజనీరింగ్‌ కళాశాలలో బీటెక్‌ చదువుతూ స్థానిక హాస్టల్‌లో ఉంటున్నారు. వీరు ఆదివారం అర్ధరాత్రి కాళిమందిర్‌ వద్ద భోజనం చేయడానికి బైక్‌పై బయలుదేరారు. అజీజ్‌నగర్‌ చౌరస్తా సమీపంలోని మజీద్‌ వద్ద మలుపు తిరుగుతుండగా బైక్‌ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. దీంతో బైక్‌ నడుపుతున్న భానుప్రకాశ్‌తోపాటు గణేశ్‌రెడ్డికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గమనించి 108 అంబులెన్స్‌లో చికిత్సకోసం నగరంలోని ఓ ప్రైవేట్‌ ఆస్పత్రికి తరలించారు. అక్కడే చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి భానుప్రకాశ్‌ మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

యువకుడి ఆత్మహత్య



నరేశ్‌ (ఫైల్‌)

ఇబ్రహీంపట్నం: ఉరేసుకొని ఓ యువకుడు బలవన్మరణానికి పాల్పడిన సంఘటన ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటుచేసుకుంది. స్థానిక ఎస్‌ఐ రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పోచారం గ్రామానికి చెందిన బత్తుల నరేశ్‌(33) ఓ ప్రైవేట్‌ సంస్థలో ఉద్యోగం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఆయన సోమవారం ఉప్పరిగూడ గ్రామ పరిధిలోని ఏపీసీ వెంచర్‌లో మామిడి చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డారు. నరేశ్‌ ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉందని ఎస్‌ఐ పేర్కొన్నారు. మృతుడికి భార్య మాధవి, రెండున్నరేళ్ల కుమారుడున్నట్లు తెలిపారు. మాధవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు వివరించారు.

గ్యాస్‌ రీఫిల్లింగ్‌.. ఒకరిపై కేసు

ఇబ్రహీంపట్నం: అక్రమంగా వంట గ్యాస్‌ సిలిండర్లను రీఫిల్లింగ్‌ చేస్తున్న ఓ షాపుపై దాడి చేసి, వ్యక్తిని అదుపులోని తీసుకున్న సంఘటన సోమవారం సాయంత్రం ఇబ్రహీంపట్నంలో చోటు చేసుకుంది. స్థానిక సీఐ సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక మంచాల రోడ్డులో గల రాఘవేంద్ర ఎలక్ట్రానిక్‌ షాపులో అక్రమంగా డోమెస్టిక్‌ సిలిండర్లను తీసుకొచ్చి, చిన్న సిలిండర్‌లో రీఫిల్లింగ్‌(నింపడం) చేస్తున్నట్లు సమాచారం అందింది. ఈ మేరకు షాపుపై దాడి నిర్వహించి మహేందర్‌ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. షాపులోని ఫిల్లింగ్‌ సామగ్రి, మూడు పెద్ద, అరు చిన్న సిలిండర్లను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

నాడు పాఠశాలలు.. నేడు తూములు



మద్యం సేవించి తరగతిగదిలో సీసాలు పగులగొట్టిన మందుబాబులు (ఫైల్‌)

- విచ్చలవిడిగా మద్యం సేవిస్తున్న యువత
- కొరవడిన నిఘా



పెద్ద చెరువు తూము వద్ద..

మత్తుకు అలవాటు పడిన యువత ఎక్కడ పడితే అక్కడ మద్యం సేవిస్తున్నారు. పాఠశాల భవనాలు, చెరువుల తూములు అడ్డాలుగా ఏర్పాటు చేసుకుని విచ్చల విడిగా తాగి సీసాలు పగులకొడుతున్నారు. దీంతో అటుగా వెళ్లే రైతులు, కూలీలతో పాటుగా చెరువు సందర్శనకు వచ్చే పర్యాటకులు సైతం ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా పోలీసులు, ఎక్సైజ్‌ అధికారులు గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

- దుద్యాల్‌